## క్లుప్తంగా

### రాజీ పడదగిన కేసులు పరిష్కరిద్దాం



క్రైమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జడ్జి భార్గవి

నందలూరు : రాజీ పడదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలని నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.భార్గవి అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి నందలూరు కోర్టు పరిధిలో ఉన్న పోలీస్ అధికారులతో గురువారం ఆమె క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా స్టేషన్‌ల పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న ఫ్రీ హోల్డ్ సర్వే



భూముల పరిశీలన కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

గాలివీడు : నిర్దేశిత గడువులోగా ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ భూముల పరిశీలన పూర్తి చేస్తామని తహసీల్దార్ భాగ్యలత తెలిపారు. శుక్రవారం మండలంలోని అరవీడు గ్రామంలో రైతులతో కలసి భూములు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఫ్రీ హోల్డ్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్ చెల్లబోవని స్పష్టం చేశారు. సెప్టెంబర్ మొదటి వారంలో ప్రారంభమయ్యే రెవెన్యూ సదస్సులను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట మండల సర్వేయర్, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్.రాచపల్లిలో వైద్య శిబిరం

పుల్లంపేట : డాక్టర్ మనోజ్ చంద్ర ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఆర్.రాచపల్లిలో వైద్య శిబిరం నిర్వహించారు. సీహెచ్ఓ నాగజ్యోతి, ఏఎన్ఎం శివరాములమ్మలు ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేశారు. జ్వరం ఉన్న వారికి రక్తన మూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రత పాటించడం వలన మలేరియా, డెంగీ లాంటి జ్వరాలను తరిమికొట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

### బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు

నందలూరు : నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో వీధి కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఏ వీధిలో చూసినా వీధికుక్కలు గుంపులుగా ఉంటూ ప్రజలను భయభ్రాంతాలకు గురి చేస్తున్నాయి. ప్రధానంగా ఉదయాన్నే పనులకు వెళ్లే కూలీలపైన, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను వెంటబడుతున్నాయి. ఎన్టీఆర్ నగర్‌లో ఓ కూలీపై కుక్కలు దాడి చేయడంతో గాయాలపాలై ఆసుపత్రి పాలైన సంఘటన కూడా చోటుచేసుకుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకొని కుక్కల బెడద నుంచి తమను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

# గడ్డి పెంపకం.. పాడి రైతులకు శ్రేయస్కరం

- వర్షాభావం దృష్ట్యా గడ్డి సాగు చేయాలంటున్న అధికారులు
- పాడి పశువులతో రైతులకు ఆదాయం
- సూచనలు పాటించాలంటూ పశు వైద్యాధికారుల సూచన



మండలంలో గడ్డి సాగు చేసిన పాడి రైతు

| నియోజకవర్గం | ఆవులు | ఎనుములు |
|---|---|---|
| రాయచోటి | 95,384 | 50,324 |
| రాజంపేట | 11,138 | 22,563 |
| రైల్వేకోడూరు | 6,604 | 25,855 |

రైల్వేకోడూరు అర్బన్ : రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలోని గ్రామాలలోని రైతులు పాడిని ఆధారంగా చేసుకొని చాలా మంది రైతులు జీవనం సాగిస్తుంటారు. చాలా మంది గ్రామాలలో వ్యవసాయ పొలాలు, బీడు భూములు, చెరువులలో పశుగ్రాసం (గడ్డి) పై ఆధారపడుతుంటారు. వేసవికాలంలో, వర్షాకాలంలో వీరు గడ్డి దొరక్క పాడి రైతులు నానాతంటాలు పడుతుంటారు. ఇలాంటి పాడి రైతులు ఇప్పుడున్న పరిస్థితులలో రైతులు తమకు ఉన్న భూమిలో కొంత భాగంలో పశుగ్రాసానికి కేటాయించుకొని అందులో పశు సంవర్ధక శాఖ అధికారులు సూచించిన ఆఫ్రికన్ టాల్ మెయిల్స్, సీఎస్‌హెచ్24, ఏపీఏఎం, కోవెరైటీ గడ్డి పెంచుకోవడం పాడిపశువులకు ఎంతో శ్రేయస్కరం. ఈ రకాలు నీటి ఎద్దడి తట్టుకొంటాయి. అదేకాకుండా పశుగ్రాసం మంచి దిగుబడి వస్తుంది. అలాగే పాడి పశువులకు పశుగ్రాసం అందుబాటులో ఉండి సమయం ప్రకారం మేత ఇవ్వచ్చు. మూడు నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాలలో ప్రభుత్వ లెక్కల ప్రకారం అన్ని రకాల పశువులు సుమారు 2,11,868 వరకు ఉన్నాయి. వీటిలో చాలా వరకు పశువులను రైతులు మేపలేక మాంసపు వ్యాపారులకు అమ్ముకొంటూ కభేళాలకు తరలిస్తున్నారు. అధిక శాతం గ్రామాలలో చిన్న కుటుంబాలు పాడి పశువులపైనే ఆధార పడుతుంటారు. ముఖ్యంగా వేసవికాలం, వర్షాకాలంలో పశుగ్రాసం కొరత అధికమై రైతుతు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో కూడా గడ్డికి ఇబ్బందు ఉంటాయని అలాంటి సమయాలలో కొంత భూమిలలో గడ్డిపెంపకం ఎంతో మేలు చేస్తుందని పశువైద్య అధికారులు సూచిస్తున్నారు. పశుపోషకులకు పశుగ్రాసం కొరత లేకుండా చేయడానికి పలు కార్యక్రమాలు చేస్తున్నా మారు మూల గ్రామాలలో ఇది కార్యాచరణ కావడంలేదు.

**ముందు జాగ్రత్తపడుదాం**

ఈ ఏడాది ఖరీఫ్‌లోనే కరువు ఛాయలు అన్ని మండలాలలో కనిపిస్తోంది. రోజూ మేఘావృతంగా ఉంటున్నా చినుకు పడిన సందర్భాలు లేవు. ఖరీఫ్‌లో పరిస్థితులు సాగుకు అనుకూలంగా లేకపోవడంతో మూడు నియోజకవర్గాలలో చాలా మంది రైతులు పంటలు వేయకుండా వదిలేశారు. ఇలాంటి పరిస్థితులు కనిపిస్తున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో గడ్డి కొరత అధికంగా ఉంటుందని పశు వైద్యాధికారులు తెలుపుతున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని పాడి రైతులు తమకున్న అరకొర భూముల్లోనే పాడి పశువులను పోషించుకునేందుకు గడ్డి పెంపకం చేపట్టాలంటూ అధికారులు తెలియజేస్తున్నారు. ప్రభుత్వ పాడిరైతులకు సొంతంగా పశుదాన పెంచుకోవడానికి ప్రభుత్వం 75 శాతం రాయితీతో విత్తనాలు అందిస్తూ వుంది. 5 కేజీల బ్యాగులు ఆయా రైతు సేవా కేంద్రాలలో లభిస్తుంది. వీటిని విత్తు కోవడం వల్ల పశుదానా సంవృద్ధిగా రైతులకు లభిస్తుంది.

**గడ్డి కోసం ఇబ్బందులు**



పశువులకు అన్ని కాలాలలో గడ్డికోసం ఇబ్బందులు పడుతున్నాం. దీంతో కొంత భూమిలో గడ్డిపెంపకం మేలనే ఉద్దేశంతో గడ్డిపెంపకానికి సిద్ధమయ్యా. పాడిరైతులకు ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహకాలు అందించాలి. పాలు ఎగుమతికి సహకరించి, ఉత్పత్తి ప్రోత్సాహకం ప్రతి లీటరుకు అదనంగా కొంత ఇస్తే బాగుంటుంది.

– కురముట్ల నరసింహులు, వడ్డిపల్లి, రైల్వేకోడూరు

**పశుగ్రాసం సాగుతో ఉపయోగం**



గ్రామాలలో పశు పోషనకు చాలా ఇబ్బందిగా ఉంటోంది. అందువల్ల కొంత మేర పశు దానా గడ్డి పెంచుతున్నా. స్థానిక అధికారుల సలహా మేరకు పెంచడం వల్ల వర్షాకాలం, వేసవికాలంలో గడ్డి ఇబ్బంది లేకుండా పోయింది. పాడి రైతులు తమకున్న భూమిని పాడి కోసం గడ్డి పెంపకం చేపట్టాలి.

– దేరంగుల ఈశ్వరమ్మ, చియ్యవరం వడ్డిపల్లి, రైల్వేకోడూరు

**పాడి పశువుల పెంపకం శ్రేయస్కరం**



పాడిపశువుల పెంపకం ఎంతో శ్రేయస్కరం. ముఖ్యంగా యువత పాడిపరిశ్రమ వైపు మొగ్గు చూపితే మంచి లాభాలు తెచ్చుకోవచ్చు. ఇది నిరుద్యోగులకు ఉపయోగకరం. ఉన్న పొలంలో 10 శాతం గడ్డి పెంచుకొన్నా, లేక వ్యవసాయ యోగ్యం కాని భూములలో నీటి ఎద్దడికి తట్టుకొనే మొలకలు పెంచడం ఉపయోగకరం. అలాగే పాడి రైతులు ఎప్పటికప్పుడు అధికారుల సలహాలు తీసుకోవాలి.

– డాక్టర్ గుణశేఖర్ పిళ్లై, జిల్లా పశుసంర్ధక శాఖ అధికారి, అన్నమయ్య జిల్లా

### పకడ్బందీగా ఇంటింటి సర్వే



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నైదియాదేవి

రాజంపేట : నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే పకడ్బందీగా చేయాలని రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి ఆదేశించారు. శుక్రవారం అన్నమయ్య భవన్(సబ్ కలెక్టరేట్)లో బీఎల్‌ఓ, సూపర్‌వైజర్లకు శిక్షణా తరగతులలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్లకు సంబంధించి జరుగుతున్న ఈ సర్వే పక్కాగా ఉండాలన్నారు. సర్వేలో ఓటర్ల వివరాలు కచ్చితంగా సేకరించాలన్నారు. ఎలాంటి పొరపాట్లుకు తావివ్వకూడదని చెప్పారు. తమ తమ పరిధిలో ఏ ఒక్క ఇళ్లు మిస్ కాకూండా సర్వేను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట తహసీల్దారు మహబూబ్ చాంద్, నందలూరు తహసీల్దారు అమరనాథ్, వీరబల్లి తహసీల్దారు శ్రావణి, సుండుపల్లె తహసీల్దారు దైవాదీనం, సిద్దవటం తహసీల్దారు మురాషావలీతోపాటు సూపర్‌వైజర్లు, సబ్‌కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఓబులవారిపల్లెలో పారిశుధ్య పనులు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో మూడురోజుల నుంచి పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో కాలువల్లోని పూడికతీత, చెత్తా చెదారాన్ని తొలగించి బ్లీచింగ్ చల్లారు. పంచాయతీ కార్యదర్శి భారతి పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏకీకృత పింఛన్‌ను అంగీకరించం



రాజంపేట టౌన్: ఎంఈఓ రఘునాథరాజుకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజంపేట టౌన్ : ఉపాధ్యాయుల అసంబద్ధ పని సర్దుబాటును రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. పాత పింఛన్ పునరుద్ధరించాలని, ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలన్న డిమాండ్‌లతో శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద యూటీఎఫ్ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఏకీకృత పింఛన్‌కు వ్యతిరేకమన్నారు. పాతపింఛన్ విధానాన్నే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పనిసర్దుబాటు లోపభూయిష్టంగా ఉందన్నారు. ఉన్నత పాఠశాల ల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు పదోన్నతులు చేపట్టాలని తెలిపారు. అనంతరం ఎంఈఓ కె.రఘునాథరాజు, డీటీ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

రాయచోటి అర్బన్ : ఉపాధ్యాయుల పనిసర్దుబాటులో చోటుచేసుకున్న అసంబద్ధాలను వెంటనే సవరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ అధికారులను డిమాండ్ చేశారు. అసంబద్ధ పనిసర్దుబాటు, ఏకీకృత పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం సాయంత్రం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఉపాధ్యాయుల పనిసర్దుబాటు ప్రక్రియను సవరించి తిరిగి అన్ని కేడర్ల ఉపాధ్యాయుల పనిసర్దుబాటును మండల స్థాయిలోనే నిర్వహించాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సురేంద్రారెడ్డి, దావుద్దీన్, ప్రసాద్, కిఫాయత్, రెడ్డిముని, సుధాకర్, రమణ, రాజబాబు, మోహన్‌నాయక్‌లు పాల్గొన్నారు.

## మండలాభివృద్ధికి అన్ని విధాల కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ఓబులవారిపల్లె : మండల అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చీర్ల నాగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో నిర్వహిస్తామన్నారు. అనంతరం మండల అభివృద్ధిపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముక్కవారిపల్లె ఎంపీటీసీ ఎ.విజయ్‌కుమార్ అమృతవారిపల్లిలో విద్యుత్ సమస్య ఉందని, రైతు భరోసా కేంద్రం లేదని ఈ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీ నరసయ్య, తహసీల్దార్ పీర్‌మున్నీ, ఎంపీడీఓ విజయారావు, వైస్ ఎంపీపీ గౌరీశంకర్ రాజు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### విద్యుత్ కార్మికుల ఆందోళనను జయప్రదం చేసుకుందాం

రాజంపేట రూరల్ : సెప్టెంబర్ 5న తిరుపతిలోని ఎస్‌పీడీసీఎల్ వద్ద నిర్వహించే విద్యుత్ కార్మికుల ఆందోళనను జయప్రదం చేసుకుందామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ కోరారు. స్థానిక డివిజనల్ విద్యుత్‌శాఖ కార్యాలయం వద్దనున్న సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే చలో తిరుపతి గోడపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యు.శ్రీహరి, డి.సుధాకర్, కె.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



చిన్నమండెం: భక్తులకు తీర్థప్రసాదాలను అందజేస్తున్న అర్చకులు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలో వెలసియున్న అమ్మవారి ఆలయాలలో శ్రావణమాస ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకొని అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీభుజంగేశ్వర, అమ్మవారిశాల ఆలయాలలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

చిన్నమండెం : శ్రావణ మాసం చివరి శుక్రవారం కావడంతో మల్లూరు గ్రామంలో వెలసియున్న శ్రీ మల్లూరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుడు జయరామిరెడ్డి అమ్మవారికి 116 కొబ్బరికాయలు కొట్టి అభిషేకం చేయించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు.

## గుడ్లవల్లేరు ఘటనపై సమగ్రవిచారణ జరిపించాలి




రాయచోటి జూనియర్ కళాశాల ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న బాలికలు, విద్యార్థి సంఘాలు

రాయచోటి అర్బన్ : గుడ్లవల్లి ఇంజనీరింగ్ కళాశాల వాష్‌రూముల్లో రహస్య కెమెరాల ఏర్పాటు ఘటనపై ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని రాయచోటిలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థినులు శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు తరగతులు బహిష్కరించి కళాశాల ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ కళాశాల హాస్టల్ బాత్రూంలలో రహస్య కెమెరాల ఏర్పాటు దారుణమన్నారు. కెమెరాలలో రికార్డయిన 300 వీడియోలను బయటకు పోకుండా కళాశాల యాజమాన్యం, ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. ఉన్నత చదువుల కోసం ఆడపిల్లలను కళాశాలలకు పంపితే వారి మాన, ప్రాణాలకు రక్షణ లేదనడానికి గుడ్లవల్లేరు ఘటనే నిదర్శనం అన్నారు. గుడ్లవల్లేరు ఘటనపై ప్రభుత్వం వెంటనే ఉన్నతస్థాయి కమిటీతో విచారణ జరిపించాలన్నారు. ఘటనకు బాధ్యులు ఎవరైనా, ఎంతటివారైనా కఠినంగా శిక్షించాల్సిందేనంటూ డిమాండ్ చేశారు. మరోమారు ఇలాంటి ఘటనలు జరుగకుండా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థినుల పక్షాన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామంటూ ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహ, ఉపాధ్యక్షుడు రమణ, జిల్లాకమిటీ సభ్యులు జశ్వంత్, నరేష్, చెంగయ్య, గురునాథ్ తోపాటు కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

### నేత్రదానం.. మహాదానం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజంపేట రూరల్ : నేత్రదానం మహాదానం అని కంటి వైద్యులు వెన్నపూస చంద్రశేఖరరెడ్డి కొనియాడారు. స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో శుక్రవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా నేత్రదానంపై ఆయన పశు వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేత్రదానం చేయటం వలన మరణించినా చిరంజీవిగా జీవించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు వై.విజయభాస్కర్‌రావు, కె.ప్రతాప్, ఎస్.శరత్‌కుమార్‌రెడ్డి, ఎం.వరదయ్య, పి.బస వరాజు, గురు రాజారావ్, హరిబాబు, వాణీ, సరిత పాల్గొన్నారు.

# మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

- పెద్ద ఎత్తున్న వన మహోత్సవం
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



రాజంపేట: అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో..



రాజంపేట రూరల్: మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తదితరులు



సంబేపల్లె: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జెడ్పీహెచ్‌ఎస్‌లో మొక్కలు నాటుతున్న విద్యార్థులు



చిట్వేలి: ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, అధికారులు

రాజంపేట రూరల్ : ప్రతి ఒక్కరూ తమ పరిధిలో మొక్కలు పెంపకం చేయడంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. మండల శివారు ప్రాంతమైన ఎస్ఆర్ పొలంలో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఎఫ్ఆర్ఓ ఆర్.నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆకేపాటి మొక్కలు నాటి నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి.విశ్వనాథరెడ్డి, అరిగెల సౌమిత్రి, దండు గోపీ, పోలి వేణుగోపాల్‌రెడ్డి, జీవీ సుబ్బరాజు, జి.కళ్యాణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. టీడీపీ నాయకులు కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. చమర్తి జగన్‌మోహన్‌రాజు, సుగవాసి సుబ్రమణ్యం, జనసేన నాయకులు శ్రీనివాసరాజు, బీజేపీ నేత పోతుగుంట రమేష్‌నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

**జీవరాశి మనుగడకు మొక్కలే ఆధారం**

సంబేపల్లె : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం వన మహోత్సవం సందర్భంగా యర్రగుంట్ల కస్తూర్బా బాలికల పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సునీల్‌కుమార్ మాట్లాడుతూ జీవరాశి మనుగడకు మొక్కలే ఆధారమన్నారు. ఎక్కడైతే చెట్లు నాటామో వాటిని అలాగే వదిలేయకుండా వాటిని సంరక్షన బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**మొక్కల పెంపకంతోనే రక్ష**

రైల్వేకోడూరు అర్బన్ : నేటి సమాజంలో ఉండే పర్యావరణం దృష్ట్యా మానవులకు మొక్కల పెంపకమే శ్రీరామ రక్ష అని అటవీశాఖ రేంజర్లు పీఏ శ్యామ్‌సుందర్, ప్రభాకర్ రెడ్డిలు శుక్రవారం తెలిపారు. మండలంలోని శెట్టిగుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో 500 మందికి తలా రెండు మొక్కలు పంపిణీ చేశారు. డీఆర్‌ఓలు గురవయ్య, చంద్రకళ, విద్యార్థులు పాల్గొన్నారు.

**అనుంపల్లిలో..**

చిట్వేలి: చిట్వేలి రేంజ్ పరిధిలోని రాజుకుంట పంచాయతీ, అనుంపల్లిలో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సాయివికాస్‌రెడ్డి అటవీ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి ధీరజ్, ఫారెస్టర్స్ శ్రీనివాసులు, సావిత్రి, కెవి సుబ్బయ్య, ఎన్డీఏ కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో**

రాజంపేట : అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో శుక్రవారం వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పర్యావరణ పరిరక్షకు దోహదపడతాయన్నారు. అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డా.స్వర్ణలత మాట్లాడుతూ మొక్కల నాటడం ఒక ఉద్యమంగా చేపట్టాలన్నారు. రాబోయే భావితరాలకు మంచి గాలి, మంచి వాతవరణం అందించాలంటే మొక్కలు విరివిగా నాటాలన్నారు.

**గాలివీడులో..**

గాలివీడు : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎంపీడీఓ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని గోరాన్ చెరువు గ్రామంలో వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలన్నారు. మొక్కల సంరక్షణతోనే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలితో పాటు సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు.

**మానవ మనుగడకు చెట్లు అవసరం**

సిద్దవటం : మానవ మనుగడకు చెట్లు చాలా అవసరమని, అధిక సంఖ్యలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని వన మహోత్సవం అంటారని సిద్దవటం జెడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ శ్రీహరి శుక్రవారం తెలియజేశారు. వన మహోత్సవం పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో పలు చోట్లు మొక్కలు నాటారు.



గాలివీడు: వన మహోత్సవంలో పాల్గొన్న అధికారులు



రైల్వేకోడూరు అర్బన్: మొక్కలు నాటుతున్న పోలీసులు



సిద్దవటం: మొక్కను నాటుతున్న ఉపాధ్యాయులు

### కుక్కలకు యాంటీ రాబిస్ టీకాలు వేయించండి

రైల్వేకోడూరు అర్బన్ : ప్రతి ఒక్కరూ తమ పెంపుడు కుక్కలకు, పంచాయతీ వారు వీధి కుక్కలకు యాంటీ రాబిస్ టీకాలు తప్పనిసరిగా వేసి కుక్కల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల నుండి రక్షణ పొందాలని శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఏడీ సురేష్‌రాజు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు, వీధికుక్కలకు యాంటీ రాబిస్ టీకాలు తప్పనిసరిగా వేయాలని తెలియజేశారు. వీధికుక్కలకు పంచాయతీ అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారులు సంయుక్తంగా కుటుంబ నియంత్రణ చేపట్టాలని అలాగే ప్రజలు ఆహార వ్యర్థపదార్థాలు ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఉంటే కుక్కలను నివారించవచ్చని చెప్పారు. కుక్కకాటు బాధితులు దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకోవాలని సూచించారు.

### తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల పట్ల హర్షం

నందలూరు : నందలూరు రైల్వేస్టేషన్‌లో తిరుమల ఎక్స్‌ప్రెస్, హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌లు నిలుపుదల పట్ల ఎన్డీయే కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం తిరుమల ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్లను సత్కరించి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, పోతురాజు మస్తానయ్య, ఎన్డీయే నాయకులు షబ్బీర్ అహ్మద్, హిమగిరినాథ్ యాదవ్, తాటి సుబ్బరాయుడు, ఎం.రాము, గంధం గంగాధర్, షమీవుల్లా ఖాన్, ఉప్పుశెట్టి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.